క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



జడ్చర్ల టౌన్: మండలంలోని కిష్టారం మాజీ సర్పంచ్ నర్సింహులు కుటుంబానికి మాజీ సర్పంచ్‌లు ఆదివారం రూ.85వేల ఆర్థికసాయం అందజేశారు. జడ్చర్లలో నివాసం ఉంటున్న మృతుడి భార్య సుమతికి నగదును అందించారు. గత నెలలో అనారోగ్యం కారణంగా నిమ్స్‌లో చికిత్సపొందుతూ నర్సింహులు మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు మాజీ సర్పంచ్‌ల సంఘం ముందుకొచ్చింది. కుటుంబానికి పూర్తి అండగా ఉంటామని భరోసా కల్పించారు. మాజీ సర్పంచ్‌లు ప్రణీల్‌చందర్, ప్రభాకర్‌రెడ్డి, బాల్‌సుందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పరామర్శ

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన మహ్మద్ రఫి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించారు. బాధితకుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నవాబుపేట: మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. ఆదివారం చిన్నమేగ్యతండా నుంచి కొండాపూర్ గ్రామానికి వచ్చే రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న కృత్రిమ ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోగా డ్రైవర్ పరారయ్యాడు. ట్రాక్టర్ నంబర్ ఆదారంగా చిన్నమేగ్యతండాకు చెందిన గోన్యానాయక్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్ సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మిడ్జిల్: మండలంలోని వెలుగొమ్ములలో ఆదివారం బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామానికి వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. పెళ్లి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వివాహం జరపడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అనంతరం అమ్మాయిని మహబూబ్‌నగర్‌లోని సఖి కేంద్రానికి తరలించారు.

వెంకటయ్యను ఆదుకోవాలి



మహమ్మదాబాద్: గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న ఎంపీడబ్ల్యూ వర్కర్ వెంకటయ్యను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. పంచాయతీ వర్కర్‌గా పనిచేస్తూ జనవరి 3న ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడి కాలు విగిరి మంచానికే పరిమితమయ్యాడని తెలిపారు. విధుల్లో ఉంటూ ప్రమాదం జరిగితే గ్రామ పంచాయతీ పట్టించుకోకుంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోకుంటే సీఐటీయూ తరపున ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్‌గౌడ్, చంద్రమ్మ, రాములు, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

అడ్డాకుల: రాష్ట్రంలో రూ.398 వేతనంపై పనిచేసిన వేలాది మంది స్పెషల్ టీచర్లకు వారి సర్వీసు కాలానికి ప్రభుత్వం నోషనల్ ప్రాతిపదికన ఇంక్రిమెంట్లు ఇవ్వాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మావిళ్ల లక్ష్మణ్‌గౌడ్, వెంకట నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్పెషల్ టీచర్ల విద్యా సేవలను గుర్తించి వారికి ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

నిజాయితీ చాటుకున్న పంచాయతీ కార్మికుడు

దేవరకద్ర రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్మికుడు ఏసుకు ఆదివారం రోడ్డుపక్కన ఫోన్ దొరికింది. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ నాగన్నకు ఫోన్ అందించాడు. దొరికిన ఫోన్‌ను నిజాయితీగా తిరిగి ఇచ్చిన ఏసును ఎస్‌ఐతో ఫోన్ యజమాని అభినందించారు.

‘పలుగు’తో పాడైపోయింది

- అధికలోడ్‌తో వస్తున్న వాహనాలు
- గుంతలమయంగా రాయపల్లి రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు



రాయపల్లి శివారులో డంప్‌చేసిన పలుగురాళ్ల కుప్పలు



గుంతలమయంగా మారిన రాయపల్లి బీటీరోడ్డు

రాజాపూర్: పలుగురాళ్ల అధికలోడ్‌తో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో మూడున్న కిలోమీటర్ల రోడ్డు పాడైపోయింది. గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించి ఇబ్బందులు తొలగించాలని ప్రభుత్వం చూస్తుంటే వేసిన రోడ్డుపై అధికలోడ్‌లతో వెళ్తున్న వాహనాలకారణంగా రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. మండలంలోని రాయపల్లికి ముదిరెడ్డిపల్లి జాతీయరహదారి నుంచి ఉన్న మూడున్నర కిలోమీటర్ల బీటిరోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతమయంగా మారింది. గ్రామ శివారులో ఓరైతు పొలంలో ఎక్కడి నుంచో తీసుకువస్తున్న పలుగురాళ్లను భారీ టిప్పర్లలో ఇక్కడికి తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. తిరిగి ఈ పలుగు రాళ్లను పగులగొట్టి ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు టిప్పర్లలో తరలిస్తున్నారు. రాయపల్లి బీటీరోడ్డు గుంతలమయంగా మారుతుండటంతో ప్రజలు ఇటీవలే ముదిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదుచేశారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శి నోటీసులిచ్చినా పలుగురాళ్లను తీసుకువచ్చే వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా సంబంధిత మైనింగ్ శాఖాధికారుల చర్యలు తీసుకోవాలని రాయపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న బీజేపీ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి

గండేడ్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని బీజేపీ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని సాలార్‌నగర్‌లో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్ని గ్రామాలకు అభివృద్ధి నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వర్, భద్రేశ్వర్, సంటెం వెంకటయ్య, కృష్ణ, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో మహిళలది ప్రముఖ పాత్ర



మాట్లాడుతున్న పాస్టర్ బీఎస్ పరంజ్యోతి

స్టేషన్ మహబూబ్‌నగర్: సమాజ నిర్మాణం, అభివృద్ధిలో మహిళలు ప్రముఖ పాత్ర పోషించారని పాస్టర్ బీఎస్ పరంజ్యోతి అన్నారు. జిల్లా కేంద్రం రెమా చర్చిలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఘనంగా సన్మానం చేశారు. పరంజ్యోతి మాట్లాడుతూ జ్ఞానంతో మహిళలు కుటుంబం, సమాజ పట్ల రాణించి చరిత్రలో నిలిచారన్నారు. సంఘ పెద్దలు దేవయ్య, భరత్, శ్యాంసుందర్, ప్రసన్నకుమార్, రాజు పాల్గొన్నారు.

మహిళలు రాజకీయాల్లో రాణించాలి

జడ్చర్ల టౌన్: మహిళలు విద్య, ఉద్యోగ రంగాల్లో కొంత సాధికారికత సాధిస్తున్నప్పటికీ రాజకీయాల్లో రాణించాల్సిన అవసరం ఉందని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పీఆర్‌టీయూ భవన్‌లో శనివారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులగం దామోదర్‌రెడ్డితో పాటు రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్, ఎమ్మెల్యే తల్లి శశికళ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. వివిధ మండలాలకు చెందిన మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్మోహన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు బుచ్చారెడ్డి, ఎంఈఓ మంజులాదేవి, మండలాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంతలో అన్నదానం



నవాబుపేట: మండల కేంద్రంలో ఆదివారం సంతకు వచ్చే జనాల కోసం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఏడు నెలలుగా నిరాటంకంగా ఈకార్యక్రమం సాగుతుండటంతో సంతకు వచ్చే ప్రజలకు చాలా సౌకర్యంగా మారింది. సంతకు వచ్చే దాదాపు 50 గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేస్తుండటం విశేషం. వ్యాపారసంఘం మండలాధ్యక్షుడు సుధాకర్‌చారి, పుట్టి ఆంజనేయులు, రఘువీర్ శర్మ, నిరంజన్, నసీర్, వెంకటయ్య ఉన్నారు.

తండాల్లో తాగునీటి సమస్య

జడ్చర్ల టౌన్: మండలంలోని శిఖర్‌గానిపల్లి, యాసాయికుంటతండాల్లో తాగునీటి సమస్య నెలకొంది. మిషన్ భగీరథ ద్వారా గ్రామానికి నిత్యం 35కేఎల్ వాటర్ సరఫరా కావాల్సి ఉండగా కేవలం 20 కేఎల్ నీరు మాత్రమే సరఫరా అవుతుంది. యాసాయికుంటతండాలో కేవలం బోర్లపై ఆధారపడి నీటి సరఫరా జరుగుతుంది. వేసవికాలం కావటంతో బోరునుంచి అందే నీరు సరిపోవటంలేదు. దీంతో రెండు గ్రామాల్లో నీటిసమస్య గూర్చి కలెక్టర్‌తో జరిగిన సమావేశంలో తెలియజేసినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. శిఖర్‌గానిపల్లికి పూర్తిస్థాయిలో నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ‘భగీరథ’ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యాసాయికుంటతండాలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిఎద్దడి రాకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో రెండు గ్రామాల్లో నీటిఎద్దడి తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వ ద్వంద్వ వైఖరి

- ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకుల నిరసన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందంటూ ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు మైలారం శ్రీరాములు, ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు యేసుముల వెంకటస్వామి అన్నారు. ఆదివారం తెలంగాణచౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే గ్రూప్–1, 2, 3, హెచ్‌డబ్ల్యూఓ, ఐసీడీఎస్ ఈఓ తదితర ఉద్యోగ ఫలితాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎస్సీ వర్గీకరణ చేస్తున్నట్లు నమ్మిస్తూనే.. మరోవైపు చట్టం లేకుండానే ఉద్యోగ ఫలితాలను ప్రకటిస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. నాయకులు రాములు, రాంచందర్, గోవిందు, చెన్నయ్య, కొమ్ము కొండయ్య, పోలే బాలయ్య, జె.బాలరాజు పాల్గొన్నారు.

జయహో భారత్



జడ్చర్లలోని నేతాజీ చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటున్న క్రికెట్ అభిమానులు

- ఇండియా గెలుపుతో అంబరాన్నంటిన సంబురాలు
- హర్షం వ్యక్తం చేసిన క్రికెట్ అభిమానులు

మహబూబ్‌నగర్ క్రీడలు/ జడ్చర్ల టౌన్: ఐసీసీ పురుషుల చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు విజేతగా నిలవడంతో జిల్లావ్యాప్తంగా క్రికెట్ అభిమానులు సంబురాల్లో ముగినితేలారు. ఆదివారం జరిగిన ఇండియా–న్యూజిలాండ్‌ల మధ్య ఫైనల్ మ్యాచ్‌ను చూడడానికి ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు. ఉత్కంఠంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా గెలుపొందడంతో క్రికెట్ అభిమానులు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇండియా గెలిచిన వెంటనే సంతోషంగా టపాసులు పేల్చారు. మూడోసారి భారత జట్టు ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచింది. ఈ విజయంతో అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఇండియా సాధించిన ఈ విజయం యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలవనుంది.

చాలా సంతోషంగా ఉంది



గతేడాది జూన్‌లో టీ–20 ప్రపంచకప్‌ను భారత జట్టు గెలుపొందగా మళ్లీ ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలవడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు క్రికెట్‌కు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. గ్రామీణ క్రీడాకారుల్లో క్రికెట్ పట్ల చాలా ఆసక్తి పెరిగింది. ఈవిజయంతో మరింత మంది యువత క్రికెట్ పట్ల ఆసక్తి చూపుతారు.

ఎం.రాజశేఖర్, ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

అందరూ బాగా ఆడారు



ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు క్రీడాకారులు బ్యాటింగ్, బౌలింగ్‌లో బాగా ఆడారు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని భారతజట్టు గెలుపొందడం ఆనందంగా ఉంది. మూడున్నరేళ్ల నుంచి క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటు న్నా. మరింత శ్రద్ధ పెడుతా.

షేక్ ఫర్హాన్, యువ క్రికెటర్, మహబూబ్‌నగర్

సమష్టి కృషితో విజేతగా..



భారత జట్టు సమష్టి కృషితో ఆడి విజేతగా నిలిచింది. ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో ఇండియా జట్టు అమోఘమైన ప్రతిభ కనబరిచింది. ఇండియా కప్ గెలిచినందుకు చెప్పలేని ఆనందంగా ఉంది.

గణేష్, క్రికెటర్, మహబూబ్‌నగర్

దేపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



దేపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నవాబుపేట: మండలంలోని దేపల్లి గ్రామానికి 107 ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దేపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీడీఓ జయరాంనాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మైసమ్మ దేవాలయ చైర్మన్ జగన్, రాంచంద్రయ్య, వెంకటేష్‌గౌడ్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. లబ్ధిదారులు ఈనెల 15 లోపు బేస్‌మెంట్ పూర్తిచేస్తే వారికి మొదటి విడతలో రూ.లక్ష బిల్లు వస్తుందని డీఈ నర్సింహులు తెలపారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాడల్ విలేజ్‌గా చేసి 107 ఇళ్లను మంజూరు చేయించారని, అందరూ త్వరగా ఇళ్లు నిర్మించుకుంటే అందరికీ ఆదర్శంగా మారుతుందన్నారు. మండల కేంద్రంలో సబ్సిడీ ద్వారా బిందు సేద్యానికి పైపులను రైతులకు అందించారు. కాంగ్రెస్ నాయకులు తులసీరాంనాయక్, వాసుయాదవ్, రాంచంద్రయ్య, రాములు, సత్యం, అమరేష్, నర్సింహ, రాజు, రమేష్‌గౌడ్, మైనుద్దీన్, రాజుగౌడ్ ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ టవర్

- తరచూ ప్రమాదాలు
- కొత్తగా నిర్మించిన టవర్‌కు మార్చని వైర్లు
- ఫ్లెక్సీలు కడుతున్న రాజకీయ పార్టీలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



ప్రమాదకరంగా ఉన్న 33కేవీ విద్యుత్ టవర్, సర్కిల్‌లో కొత్తగా నిర్మించిన టవర్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం చౌరస్తాలోని 167 జాతీయ రహదారి మల్లికార్జున ఎంటర్‌ప్రైజెస్ ముందు ఉన్న 33 కేవీ విద్యుత్ టవర్ ప్రమాదకరంగా ఉంది. ఈ టవర్ రోడ్డుకు మధ్యలో ఉంది. దీంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఈచౌరస్తాలో రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు, ఇటీవల మలబార్ జ్యువలరీ దుకాణం ముందు ఇద్దరు యువకులు మృతిచెందారు. ఇటీవల 167 జాతీయ రహదారి విస్తరణ పనులు జరిగాయి. న్యూటౌన్ నుంచి బస్టాండ్ వెళ్లే రోడ్డులో ఉన్న ఈ టవర్‌కు బదులుగా మరో టవర్‌ను నిర్మించి నెలలు గడుస్తున్నా దీనికి ఉన్న 33కేవీ వైర్లను కొత్తగా నిర్మించిన టవర్‌కు మార్చడం లేదు. మెట్టుగడ్డలో కూడా ఇలాగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ టవర్‌కు ఉన్న వైర్లను కొత్త టవర్‌కు మార్చి పాత టవర్‌ను తొలగించారు. అయినా ఈటవర్‌ను ఎందుకు తీయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈరోడ్డులో రాంగ్ రూట్‌లో బైకులే కాకుండా కార్లు సైతం వస్తుంటాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈటవర్‌కు రాజకీయ పార్టీలు ఫెక్సీలు కడుతున్నాయి. ఈ సమయంలో అటువైపు నుంచి రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. విద్యుత్ అధికారులు స్పందించి కొత్తటవర్‌కు వైర్లను మార్చి పాత టవర్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

డేవిడ్ క్రిపాల్‌ను అభినందించిన జితేందర్‌రెడ్డి



డేవిడ్ క్రిపాల్‌ను సన్మానిస్తున్న జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: బీసీసీఐ విజ్జి ట్రోఫీకి ఎంపికైన మహబూబ్‌నగర్‌కు చెందిన డేవిడ్ క్రిపాల్‌ను రాష్ట్ర క్రీడల వ్యవహారాల సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి అభినందించారు. శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. బీసీసీఐ విజ్జి ట్రోఫీలో ప్రతిభ చాటాలన్నారు. క్రికెట్‌లో ఉన్నత స్థాయికి చేరుకొని రంజీ, భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించాలని కోరారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పరీక్ష



ప్రతిభ పరీక్షను వివరిస్తున్న నిర్వాహకుడు

దేవరకద్ర రూరల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు బాలకృష్ణ మాట్లాడుతూ ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల్లో ప్రతిభను తెలుసుకోవచ్చన్నారు. తెలుగు, గణితం, ఇంగ్లిష్‌లో వెనకబడిన విద్యార్థులకు ఏప్రిల్ 25నుంచి మే25 వరకు మెళకువలు నేర్పించేలా శిక్షణ ఇస్తామన్నారు. వీటితో పాటు నృత్యం, కరాటే, యోగ లాంటి వాటిలో తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు మహబూబ్‌నగర్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా ముక్కోటి మైసమ్మ జాతర



బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్ల గాదిర్యాల్ గ్రామాల పరిధిలో గల ముక్కోటి మైసమ్మ జాతర ఘనంగా జరిగింది. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం ఆయా గ్రామాల నుంచి మహిళలు బోనాలతో ప్రదక్షిణలు నిర్వహించారు. మండల ప్రాంతంలో ఎంతో మహిమ గల ముక్కోటి మైసమ్మ జాతరకు రుసుంపల్లి, నంచర్ల, గాధిర్యాల్, బోయగుడిసెలు, వడ్డెగుడిసెలు గిరిజన తండాల నుంచి ఎంతో మంది భక్తులు తరలివచ్చారు. దీంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ప్రతి మంగళ, శుక్ర, ఆదివారాల్లో ఎంతో మంది భక్తులు కుటుంబ సమేతంగా ఇక్కడికి వచ్చి తమ మొక్కులను తీర్చుకుంటారు. అలాంటివారు ఆదివారం కూడా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్కులు తమ మొక్కులను తీర్చుకు వెళ్లిపోయారు. ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

ఆనంద్‌కు ‘విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు’ పురస్కారం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మినారాయణ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మణి ఆనంద్‌కు ‘విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు’ పురస్కారం లభించింది. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి ఈ అవార్డును అందజేశారు. ఈసందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా వివిధ రకాల స్వచ్ఛంద కార్యక్రమాలు చేసినందుకు తనకు ఈ అవార్డు లభించిందని తెలిపారు. దీంతో పాటు 50 సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్‌రాజు, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం

నవాబుపేట: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలలో ఒక రోజంతా గడిపి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమకు గతంలో పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శివ, సంతోష్, కుమ్మరి రాజు, శేఖర్, ఆనంద్, బిందు, కీర్తన, అరుణ పాల్గొన్నారు.

40 సంవత్సరాల తర్వాత కలుసుకున్న..

దేవరకద్ర రూరల్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 1984–85లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం శ్రీనివాస్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 40 సంవత్సరాల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలుకరించుకుంటూ, కష్ట సుఖాలను పంచుకుంటూ సంతోషంగా గడిపారు. తమకు విద్యను బోధించిన గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వేములలో జెడ్పీహెచ్‌ఎస్‌లో..

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. 2004–05వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సమావేశం ఏర్పాటు చేశారు. 20 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. నాడు వారికి చదువులు చెప్పిన గురువులు ప్రభులింగం, జయశంకర్, ఉంద్యాల కొండారెడ్డి, రాజశేఖర్, రాంచంద్రయ్య శాంతమ్మ, రఘురాములు, శారద, మంజులను పాఠశాలకు ఆహ్వానించారు. వారిని శాలువా పూలమాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులు రాకేష్‌గౌడ్, ప్రదీప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, నర్సింహ్మ, విష్ణు పాల్గొన్నారు.



నవాబుపేటలో గురువులతో పూర్వ విద్యార్థులు



అడ్డాకుల మండలం వేములలో..